క్లుప్తంగా

గంజాయి తాగుతున్న ముగ్గురిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: గంజాయి తాగుతున్న ముగ్గురిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యానగర్‌లోని ఓ హోటల్‌లో యువకులు గంజాయి తాగుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా ఎం.శ్రీనివాసరావు

పట్నంబజార్: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా ఎం.శ్రీనివాసరావు గురువారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రకాశం జిల్లాలోని పలు స్టేషన్లలో పని చేశారు. 2021లో ఆయనకు సీఐగా పదోన్నతి లభించింది. కొండెపిలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన్ను గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ట్రాఫిక్ సీఐగా పనిచేసిన నిసార్ బాషాను వీఆర్‌కు పంపుతూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

నూతన భవనంలోకి యనమదల సీజీజీబీ బ్రాంచి



కొరిటెపాడు(గుంటూరు): ఖాతాదారులకు లాకర్ సదుపాయాలతో మరిన్ని సేవలు అందించేందుకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ గుంటూరు రూరల్ మండలం, యనమదల శాఖ విశాలమైన నూతన భవనంలో గురువారం కొలువుదీరింది. బ్రాంచిని డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు అందించటంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మార్కెట్ పరిస్థితులకు అతీతంగా సమాజంలో అన్ని వర్గాల కస్టమర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు డిపాజిట్లపై అత్యధికంగా 8.75 శాతం వడ్డీ సీజీజీబీ అందిస్తోందని వివరించారు. సీజీజీబీ జనరల్ మేనేజర్ పి.మారుతీరాం మాట్లాడుతూ బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.18 వేల కోట్లు అధిగమించిందని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.89 కోట్ల నికర లాభం సాధించినందుకు ఖాతాదారులకు అభినందనలు తెలిపారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.వీరారెడ్డి, బ్యాంక్ ప్లానింగ్ మేనేజర్ కె.ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్లు వై.శ్రావణ్, కె.శ్రీకాంత్, పలువురు ఖాతాదారులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

కాకుమాను: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం–1లో గురువారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడారు. గ్రామీణ ప్రజల ఇంటి ముంగిటకే వారికి అవసరమైన వివిధ ధ్రువపత్రాలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అర్జీదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. సర్పంచ్ శివకుమారి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, జేసీఎస్ మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులకు ప్రజా ప్రతినిధులకు సన్మానం

కాకుమాను: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, పైసా ఖర్చు లేకుండా అర్హులందరికి ఉచితంగా వివిధ రకాల ధ్రువ పత్రాలను అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థాన కల్యాణ మండలంలో గురువారం జగనన్న సురక్ష శిబిరాలను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో అధికారుల సేవలు అభినందనీయమన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులను ఘనంగా సన్మానించారు.

కేఎల్‌యూలో ఉస్తాద్ చిత్ర బృందం సందడి

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం కేఎల్ ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో ఇట్స్ షో టైమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉస్తాద్ చిత్ర బృందం విచ్చేసి విద్యార్థులను ఉత్సాహపర్చింది. డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ ఇట్స్ షో టైమ్ అనే కార్యక్రమం వలన విశ్వవిద్యాలయం శక్తివంతమైన చలన చిత్ర సంస్కృతిని ప్రదర్శించిందని అన్నారు. అత్యంత ప్రశంసలు పొందిన వారాహి చలనచిత్రం ఉస్తాద్ కథానాయకుడు ఫణిదీప్, కథానాయికి కావ్య కళ్యాణిరామ్‌లు విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాలను వీక్షించారు. వర్శిటీలోని విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలు, ఇతర సినిమాలను ప్రదర్శించారు.

పొన్నూరు పట్టణాభివృద్ధికి టీడీపీ ఆటంకాలు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: పొన్నూరు పట్టణాభివృద్ధికి టీడీపీ ఆటంకాలు సృష్టిస్తూ.. కుట్రలు, కుయుక్తులు పన్నుతోందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అతని అనుచరుల చేత కోర్టులో కేసులు వేయించి, బయట ప్రజలకు దేవుడి భూములు కాజేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలో జీబీసీ రోడ్డు విస్తరణ జరుగుతుందన్నారు. ఆటో నగర్‌కు, పట్టణ రోడ్డు విస్తరణకు ఆటంకాలు సృష్టించి చరిత్ర హీనుడివి కావొద్దని ధూళిపాళ్లను హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, మాజీ కౌన్సిలర్లు ఎం.అనిల్‌కుమార్, షేక్ షర్మిల, రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మాము, కొల్లేరు శ్రీనివాసరావు, ఇందేటి వెంకట సుబ్బయ్య, గేరా సంజీవ్, దేవరకొండ గోపీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో వన మహోత్సవం



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న యాజమాన్యం

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో సిబ్బంది మొక్కలు నాటారు. అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ చూడాలని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా వాటిని పరిరక్షించాలన్నారు. ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేస్తూ అందరిచేత ''పర్యావరణ పరిరక్షణ'' ప్రతిజ్ఞ చేయించారు. ''మెగా ప్లాంటేషన్'' కార్యక్రమం విజయవంతానికి అధిక సంఖ్యలో మొక్కలు అందించి, సహకరించిన అటవీ శాఖ సిబ్బందికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.సుధాకర్, డాక్టర్ జి.రామ్మోహన్ బాబు, డాక్టర్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పెదకాకాని: ఎలుకల మందు తిని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ కాలేశావళి, రజియా దంపతులు స్థానిక దర్గా వద్ద నివాసం ఉంటున్నారు. మనస్పర్థలతో వీరు కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మొహనాజ్ భర్తతో గొడవపడి పుట్టింటి వద్దే ఉంటోంది. పది రోజుల క్రితం అదే ప్రాంతంలో నివశిస్తున్న తన మేనత్త హజరబీ ఇంటికి మొహనాజ్ వెళ్లింది. రాత్రి నిద్రపోతున్న సమయంలో హజరబీ భర్త అమీర్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరించింది. కానీ, వారు పట్టించుకోకపోవడంతో మొహనాజ్ రెండు రోజుల క్రితం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు.. గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

కమిషనర్ చేకూరి కీర్తి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ చేకూరి కీర్తి

నెహ్రూనగర్: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ చేకూరి కీర్తి స్పష్టం చేశారు. ఎల్.ఆర్ కాలనీ, రాజీవ్‌గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లో డోర్ టు డోర్ ఓటర్ సర్వేని బుధవారం అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, సూపర్‌వైజర్లతో కలసి ప్రత్యక్షంగా పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఎల్.ఆర్ కాలనీ 203 పోలింగ్ స్టేషన్ బీఎల్‌ఓ జి.రమేష్‌బాబు, రాజీవ్‌గాంధీ నగర్ 46 పోలింగ్ స్టేషన్ బీఎల్‌ఓ బి.రఘుబాబుని విధుల నుంచి సస్పెండ్ చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్– 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టు డోర్ సర్వేను బీఎల్‌ఓలు పక్కాగా చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్‌వైజర్లు మరింత బాధ్యతగా సర్వేని పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సర్వేలో ప్రధానంగా ఒకే డోర్ నంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉన్నా, జీరో డోర్ నంబర్ ఉన్న వాటిని, జంక్ క్యారెక్టర్లు ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలన చేయాలని తెలిపారు. వయస్సు 100పై బడిన వారి ఓటర్ల వయస్సు ధ్రువీకరణ పత్రాల్ని పరిశీలించాలని చెప్పారు. బీఎల్‌ఓ యాప్‌లో సమస్య ఎదురైతే వెంటనే నగరపాలక సంస్థ ఎన్నికల విభాగ సిబ్బందిని సంప్రదించాలని కమిషనర్ సూచించారు. బీఎల్‌ఓలంతా నగరపాలక సంస్థ గుర్తింపు కార్డులను ధరించి సర్వేలో పాల్గొనాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, రవీంద్ర, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మ పాల్గొన్నారు.

పనుల్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని, ఇంజినీరింగ్ అధికారులు కూడా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శ్యామలానగర్ రోడ్డులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం స్విమ్మింగ్ పూల్, ఉద్యోగ నగర్, ఎస్‌వీఎన్ కాలనీ పార్కులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్కులు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు టెండర్ పొంది పనులు నిర్దేశిత గడువు మేరకు చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అటువంటి కాంట్రాక్టర్లపై, పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్యామలానగర్ రోడ్డులోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలో పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఏఈని ఆదేశించారు. ఉద్యోగనగర్ పార్క్‌లో పనులకు ఆమోదం వచ్చినా ఇంకా ప్రారంభించకపోవడంపై ఇంజినీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ప్రారంభించాలని స్పష్టం చేశారు. పార్క్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణంపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేనిపక్షంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించబోమని తెలిపారు. ఎస్‌వీఎన్‌కాలనీ పార్క్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టాలని, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఎక్విమెంటుకు మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర, ఈఈ సుందర్రామిరెడ్డి, ఏడీహెచ్ రామారావు, డీఈఈ మహ్మద్ రఫిక్, ఎస్ఎస్ సోమ శేఖర్, ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, డేవిడ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

చేబ్రోలు: కులం పేరుతో దూషించిన తండ్రీకొడుకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. వడ్లమూడికి చెందిన కఠివరపు సుజిత్ కుమార్ వద్ద అదే గ్రామానికి చెందిన అద్దంకి నాగమల్లేశ్వరరావు రూ.11లక్షలు నగదు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి తీసుకోవటానికి వెళ్లిన తనను అద్దంకి నాగమల్లేశ్వరరావు, అతని కుమారుడు భరత్ కులం పేరుతో అసభ్యకరంగా దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు సుజిత్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ నిమిత్తం డీఎస్పీకి కేసును బదిలీ చేయనున్నట్లు ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

డిగ్రీ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు

ఆచార్య ఈదర శ్రీనివాసరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ నూతన విద్యా విధానంతో డిగ్రీ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య ఈదర శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం జాతీయ నూతన విద్యా విధానం–2020పై అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థి ఒక మేజర్ సబ్జెక్టు, ఒక మైనర్ సబ్జెక్టు ఎంపిక చేసుకోవాల్సి ఉందని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాల్ని పెంపొందించే విధంగా కోర్సులు రూపకల్పన చేశారని తెలిపారు. వీటిని ప్రవేశపెట్టేందుకు ప్రధాన కారణం విద్యార్థులు త్వరగా ఉద్యోగాల్లో స్థిరపడాలనేది ముఖ్యోద్దేశంగా వివరించారు. ఆనర్స్ డిగ్రీ కోర్సులో విద్యార్థి మొదటి ఏడాది వరకే చదివితే ఒక సంవత్సరం సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు చదివితే డిప్లొమా సర్టిఫికెట్, మూడు సంవత్సరాలు చదివితే డిగ్రీ సర్టిఫికెట్, పూర్తిగా నాలుగేళ్లు చదివితే ఆనర్స్ సర్టిఫికెట్‌ను యూనివర్సిటీ ప్రదానం చేస్తుందని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి అధ్యాపకులే కారకులవుతారని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ ఏబీవీ మనోహర్, డాక్టర్ ఎస్.అనితాదేవి, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ కె. శాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు, పక్కన ఎస్‌ఐలు విజయ్‌కుమార్, వెంకటేశ్వరరావు

తెనాలి రూరల్: తెనాలి పట్టణ శివారు పినపాడు దుండిపాలెం డొంక రోడ్డులో ఈ నెల 25న జరిగిన దారి దోపిడీ కేసును త్రీ టౌన్ పోలీసులు ఛేదించారు. ఆటో ఎక్కిన ఓ వ్యక్తిని మారుమూల ప్రదేశానికి తీసుకువెళ్లి బెదిరించి సెల్‌ఫోన్, నగదు లాక్కున్న ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాల్ని సీఐ ఎస్. రమేష్‌బాబు తెలియజేశారు. సుల్తానాబాద్‌లోని ఆలపాటి నగర్‌కు చెందిన ముప్పాళ్ల శివ చంద్రశేఖరరావు ఈ నెల 25న ఉదయం భట్టిప్రోలులో డ్యూటీకి వెళ్లి, తిరిగి రాత్రి 8.30 గంటలకు తెనాలి చేరుకున్నారు. ఇంటికి వెళ్లేందుకని మార్కెట్ వంతెన వద్ద ఆటో ఎక్కారు. ఆటోలో అప్పటికే ఇద్దరు యువకులు ఉండగా, తాను మార్కెట్ యార్డు వద్ద దిగుతానని చెప్పి చంద్రశేఖరరావు ఆటోలో కూర్చున్నారు. అప్పటికే ఆటోలో ఉన్న మోరిస్‌పేట సీఎం కాలనీకి చెందిన కట్టా ఏసయ్య అలియాస్ ఏసు, కఠెవరం కాలువ కట్ట రోడ్డుకు చెందిన గుంజి శ్రీను, కమాధుల ఏసురత్నంలు సుల్తానాబాద్‌లో ఆటో ఆపకుండా పినపాడు గ్యాస్ గోడౌన్ సమీప నిర్మానుష్య ప్రాంతానికి చంద్రశేఖరరావును తీసుకు వెళ్లారు. అక్కడ అతడిని బెదిరించి జేబులో ఉన్న స్మార్ట్ ఫోన్, ఓ లెదర్ బ్యాగ్, రెండు వేల రూపాయల నగదు లాక్కున్నారు. అప్పుడే అటుగా ఓ మోటార్ బైక్ రావడంతో అది చూసి వారు ఆటోతో సహా పరారయ్యారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఒక రోజు వ్యవధిలోనే ముగ్గురు నిందితుల్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వారి నుంచి బ్యాగుతో పాటు సెల్‌ఫోన్స్, నగదు, నేరం చేసేందుకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్ని అరెస్టు చేసిన సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐలు కె. వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ నరేష్, సిబ్బంది రంజిత్, అంకయ్యను డీఎస్పీ బి. జనార్దనరావు అభినందించారు.

రైల్వే విద్యుత్ తీగను పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్వే విద్యుత్ తీగను పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... బాపట్ల జిల్లా చుండూరు రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి గూడ్స్ రైలు లూప్ లైన్‌లో నిలిపి ఉంది. ఈ సమయంలో 35నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి గూడ్స్ బోగి ఎక్కి విద్యుత్ తీగలను పట్టుకున్నాడు. తీవ్ర గాయాలతో ఉన్న అతడ్ని 108లో గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సమాచారం మేరకు తెనాలి జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మతిస్థిమితం లేని వ్యక్తి అని పోలీసులు వెల్లడించారు.

పేద విద్యార్థులకు ఫీజు చెల్లింపు



గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థుల ఫీజుల్ని పూర్వ విద్యార్థి తిరుమలశెట్టి రాజశేఖర్ చెల్లించారని ప్రిన్సిపాల్ ఏబీవీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూర్వ విద్యార్థి రాజశేఖర్ ఎంతో ఔదార్యంతో తాను విద్యను అభ్యసించిన కళాశాలలో ఆయన తల్లి తిరుమలశెట్టి విజయలక్ష్మి పేరుపై పేద విద్యార్థులకు ఫీజుల్ని చెల్లించడం అభినందనీయమన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి మొహ్మద్ ఖాసీం, సీఈసీ విద్యార్థిని ఎం. స్పందన, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థిని కె. సుబ్బాయమ్మ ఫీజుల్ని చెల్లించినట్లు వివరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించిన పూర్వ విద్యార్థి రాజశేఖర్‌ను కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, జి. సురేష్‌కుమార్, కాశీరత్నం పాల్గొన్నారు.

మిరప పంట సమగ్ర యాజమాన్యంపై శిక్షణ



రైతులతో ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ జి.కిషోర్‌బాబు

గుంటూరు రూరల్: రైతులు పంటలకు ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని లాం ఫాం ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.కిషోర్‌బాబు అన్నారు. వట్టిచెరుకూరు మండలం చింతపల్లిపాడు గ్రామంలో గురువారం మిర్చి పంటలో యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ సదస్సును ఆయన నిర్వహించారు. పంటకు నిర్దేశించిన విధంగా తగిన మోతాదులో ఎరువు వినియోగించుకోవాలని సూచించారు. మిరప సాగుకు ముందుగా పచ్చిరొట్ట ఎరువు కలియదున్నడం వల్ల భూమి సారవంతమవుతుందన్నారు. విస్తరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీలతావాణి మాట్లాడారు. భూమి ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు తప్పనిసరిగా ట్రైకోడెర్మావిరిడి పశువుల ఎరువులో కలిపి వాడాలని సూచించారు. వేరు పురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లో ఎకరాకు 10–12 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను భూమిలో వేసుకోవాలని చెప్పారు. నారు కుళ్లు నివారణకు బైటాక్స్ 3 గ్రాములు, లీటరు నీటికి కలిపి 9 రోజులకు ఒకసారి, 13, 21 రోజులకు పిచికారి చేయాలన్నారు. ట్రైకోడెర్మావిరిడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి లక్ష్మి, ఇంచార్జ్ వీఏఏ సుభాని, వీరనారాయణ, రైతులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంలో 'బాలవాటిక' తరగతులు

నల్లపాడు కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ హనీమెహత



మొక్కలు నాటిన ప్రిన్సిపల్ హనీమెహత, ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: సులభతర పద్ధతిలో నూతన విద్యా విధానాలతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నట్లు నల్లపాడు కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ హనీమెహత తెలిపారు. విద్యాలయంలో గురువారం జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ) 3వ వార్షికోత్సవాలను నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ, ఆట పాటలతో విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఈపీ ద్వారా ప్రారంభించిందన్నారు. అనతి కాలంలో మంచి ఫలితాలను సాధించిందని తెలిపారు. 21వ శతాబ్దం అవసరాలకు సరిపోయే విస్తృత ఆధారిత సౌకర్యవంతమైన, బహుళ క్రమశిక్షణ విద్యా విధానం ద్వారా భారతదేశాన్ని శక్తివంతమైన, జ్ఞాన సమాజంగా తయారు చేసేందుకు ఈ విద్యా విధానం తోడ్పడుతుందన్నారు. రోట్ లెర్నింగ్ విధానం కాకుండా క్రిటికల్ థింకింగ్‌ను ప్రోత్సహించకుండా చదువుకు బదులుగా నేర్చుకోవడంపై దృష్టి సారించటం జరిగిందన్నారు. నూతనంగా 'బాలవాటిక' పరిచయం జరిగిందని తెలిపారు. ఈ విధానంలో 3, 4, 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు బాల వాటికలో మూడు తరగతులు ప్రారంభించనున్నారని చెప్పారు. అందులో బాలవాటిక–3 ఈ ఏడాది ప్రారంభించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 450 కేంద్రియ విద్యాలయాల్లో ఈ బాలవాటిక తరగతులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. విద్యా ప్రవేశ్ అనే కార్యక్రమం ద్వారా చిన్నారులకు 3 నెలల ప్లే బేస్డ్ స్కూల్ ప్రిపరేషన్ మాడ్యుల్‌ను అభివృద్ధి చేయటం జరిగిందని ప్రిన్సిపల్ వివరించారు. విద్య, ఆటపాటలు, క్రీడల ద్వారా విద్యా, వృత్తి విద్య, సాంకేతిక విద్య, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సబ్జెక్ట్‌లను చిన్నారులకు బోధించటం జరుగుతుందన్నారు. ఈ విధానాల్లో బోధనకు ఇప్పటికే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ విధానం ద్వారా ఆయా కార్యక్రమాల సరళిని ప్రదర్శించారు. పాఠశాల హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు శ్రీదేవి, ఆంజనేయులు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం మార్గం ఆదర్శనీయం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ రాధిక

గుంటూరు రూరల్: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మార్గం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక అన్నారు. పెదపలకలూరులోని కళాశాలలో గురువారం అబ్దుల్ కలాం వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం మార్గంలో నడిచి, సమాజానికి ఉపయోగపడే విధంగా నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేబ్రోలు: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శనీయులని ఏపీ నవ చైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ అన్నారు. మండలంలోని వడ్లమూడి గ్రామంలో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో గురువారం అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గంగా యాదవ్ మాట్లాడుతూ రామేశ్వరంలోని నిరుపేద కుటుంబంలో జన్మించి, భారత రక్షణ రంగాన్ని అగ్రపదంలో నిలిపిన కలాం సేవలు ఎనలేనివన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తోట నాగరాజు, తాడిబోయిన బ్రహ్మం, నూకాలయ్య, పవన్‌కుమార్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

'చలపతి ఫార్మసీ'లో జాతీయ స్థాయి సదస్సు



డాక్టర్ విలియం కేరి, డాక్టర్ వై.కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: యాంటీ మైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్, క్లినికల్ అప్లికేషన్స్‌పై రెండు రోజుల జాతీయ స్థాయి సమావేశాన్ని తమ కళాశాలలో నిర్వహించినట్లు చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారులోని లాంనందున్న కళాశాలలో గురువారం ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం, అమరావతి రీజినల్ చాప్టర్, ఐఎస్‌పీఓఆర్ ఏఎన్‌యూ స్టూడెంట్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యాంటి బయోటిక్స్ గుణాలు, ప్రత్యేకతలు వివరించారు. గుంటూరు సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ యాంటీ బయాటిక్స్ ఉపయోగం, నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం యాంటిబయోటిక్స్ అనేవి ప్రతి చిన్న వ్యాధికి వాడుతున్నారని, దీని వల్ల మనిషి రోగనిరోధక శక్తి కోల్పోవటమే కాకుండా మరో వ్యాధికి ఆహ్వానం పలికినవారవుతారని తెలిపారు. యాంటి బయోటిక్స్ కేవలం వైద్యుల సలహా మేరకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా రీసెర్చ్ వైపు మక్కువ చూపాలని సూచించారు. నాగర్జున విశ్వవిద్యాలయం బోటనీ, మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎ.అమృతవల్లి మాట్లాడుతూ ఫార్మసీ రంగం.. ఆరోగ్య రంగానికి వెన్నుముఖ వంటిదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వైద్యుల సలహా లేనిదే ఏ ఔషధాన్ని తీసుకోరాదని చెప్పారు. వైద్యులు సూచించిన కోర్స్‌ను పూర్తిగా వాడాలని లేకుంటే వ్యాధి తిరగబెట్టే అవకాశాలుంటాయని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఈ సదస్సులో 200 మందికి పైగా ప్రతినిధులు, వివిధ ఫార్మసీ సంస్థల ప్రిన్సిపల్స్, ఫ్యాకల్టీ పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ రెండు రోజుల సదస్సులో 65కి పైగా పోస్టర్, ఈ పోస్టర్ ప్రజెంటేషన్‌లు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి వై.సుజిత్‌కుమార్, బెంగళూరు హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్ క్లినికల్ ఫార్మకాలోజిస్ట్ డాక్టర్ జె.గౌతమ్ కుమార్, డాక్టర్ జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అతిథులను ఘనంగా సన్మానించారు.

నగదు మాయంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఖాతాలో నగదు మాయంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయినగర్ 5వ లైనులో నివసించే విజయ కాశీ అనే మహిళకు ఏటీ అగ్రహారంలోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. జూన్‌లో ఖాతాలోకి రూ. 30 వేలు మూడు విడతలుగా ఆమె ప్రమేయం లేకుండా విత్‌డ్రా అయ్యాయి. ఆలస్యంగా గుర్తించిన ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.